
మాయ గుర్రం
మేటి గుర్రం





మాయ గుర్రం - మేటి గుర్రం

రష్యాదేశపు జానపద గాథ

పునఃకథనం:
ఎమ్. బులాతోవ్
చిత్రములు:
టి. మావ్రిన



అనగా అనగా ఒక ముసలాడు.

ముసలాడికి ముగ్గురు కొడుకులు. చిన్నవాణ్ణి వెర్రివెంగళాయ ఇవానుష్క అని పిలిచేవారు.

ముసలాడు పొలంలో గోధుమ చల్లాడు. పైరు కంకెవేసి కన్నులపండువుగా వుంది. కాని అక్కడక్కడ పైరు వాలిపోయి, ఎవరో కాని కాళ్లతో తొక్కేసినట్టు అనుపడింది.

ముసలాడు కొడుకుల్ని పిలిచి:

"ఒరే అబ్బాయిలూ! మీరు వంతులు వేసుకుని ప్రతి రాత్రీ పొలంలో కాపు కాసి, దొంగను పట్టుకోండి!" అన్నాడు.





తొలి రాత్రి వచ్చింది

పెద్ద కొడుకు వెళ్ళాడు పొలం కాయడానికి. కాస్సేపు కాపలా వుండి, ఇక నిద్రపోదామని బుద్ధి పుట్టి, పొలంలో వున్న కసవుమేటులోకి దూరి, తెల్లవారే వరకూ హాయిగా నిద్రపోయాడు.

తెల్లవారాక ఇంటికెళ్ళి:

"రాత్రి అంతా నిద్రలేదు, పొలం కాచి కాచి, చలికి కొరడు బారిపోయనే గాని, దొంగ ఎవ్వడూ కనబడ లేదు," అన్నాడు.





మలి రాత్రి వచ్చింది

నడిపివాడు వెళ్ళాడు పొలం కాయడానికి. వీడూ రాత్రి అంతా కసవుమేటులో దూరి హాయిగా పడుకున్నాడు.

మూడో రాత్రి వచ్చింది





ఇక వెర్రివెంగళాయ ఇవానుష్క వంతు వచ్చింది. కజ్జికాయ ఒకటి జుబ్బాలో దాచేసుకుని, తాడు ఒకటి పుచ్చుకుని పొలం బయల్దేరాడు. పొలంలోకి వెళ్ళి, ఒక రాతిమీద కూచుని, కజ్జికాయ పిసరు పిసరూ కొరుక్కుని తింటూ, ఒక్క కునుకేనా తీయకుండా దొంగ కోసం కాపలా కాశాడు ఇవానుష్క.

సరిగ్గా అర్ధరాత్రప్పుడు పొలంలోకి దౌడు తీస్తూ జొరబడింది — గుర్రం ఒకటి: దాని వెంట్రుకలన్నీ వెండీ, బంగారమున్నూ. అది దౌడు తీస్తూంటే — భూమి గజగజ వణకిపోయింది. దాని ముక్కుచెరమల్లోనుంచి పొగ ఎగజిమ్ముతూంది, చెవుల్లోనుంచి మంటలు మండుకొస్తున్నాయి.





గుర్రం మొదలెట్టింది. గోధుమ పైరు మేయడం — మేసినది కొంచెమూ, తొక్కినది తెగబారెడూనూ.

గుర్రాన్ని ఇవానుష్క చాటుమాటుగా సమీపించి, చటుక్కున దాని మెడకి తాడు కట్టి, దాన్ని పట్టుకున్నాడు. తన శక్తి అంతటితోనూ గుర్రం ఒక్క ఈడ్పు ఈడ్చింది — ఏమీ కార్యం లేకపోయింది! ఇవానుష్క చప్పున ఎగిరి, దానిమీద కూచుని, దాని జూలు గట్టిగా పట్టుకున్నాడు. గుర్రం వెల్లడి పొలంలోకి అదే దౌడు దౌడాయించింది, చెంగున ముందు కాళ్లు ఎగరేసింది, వెనక్కాళ్లు తన్నింది — వాడిని మాత్రం కిందకి తోసేయలేకపోయింది!

ఇక అక్కడితో గుర్రం ఇవానుష్కను బతిమాలింది:

"నన్ను వదిలేయ్, ఇవానుష్క, నీ పుణ్యముండేను! నువ్వు ఇబ్బందిలో వున్నప్పుడల్లా నీకు నేను సాయంచేస్తాను!"

"అలాగైతే మంచిదే, నిన్ను వదిలిపెట్టేస్తా," అని ఇవానుష్క జబాబుచెప్పి, "మరి నువ్వు నాకు కనబడ్డం ఎలా?" అని గుర్రాన్ని అడిగాడు.

"నువ్వు వెల్లడి పొలంలోకెళ్లి, అక్కడనుండి బారు మైదానం మీదకెళ్లి, చెవులు గింగిరాలెత్తేటట్టు గట్టిగా మూడు మార్లు ఈల కొట్టి, దిక్కులు పిక్కటిల్లేటట్టు కేక వెయ్యాలి: 'మాయ గుర్రమా — మేటి గుర్రమా! జ్ఞానివైన తేజి గుర్రమా! గడ్డిమీద రాలే ఆకులాగ నా ఎదుట వచ్చి నిలబడు!' అప్పుడు నేను ప్రత్యక్షమవుతాను," అంది గుర్రం.

ఇవానుష్క గుర్రాన్ని వదలిపెట్టేశాడు, మరెన్నడూ పొలంలో పడి గోధుమ పైరు మేయననీ, చేను తొక్కననీ గుర్రం ఖరారుచేసింది.

తెల్లవారగానే ఇవానుష్క ఇంటికి వెళ్లిపోయాడు.

"పొలంలో నీ కేమిటి అవుపడిందిరా?" అని అడిగారు అన్నగార్లు.

"గుర్రం ఒకటి అవుపడితే దాన్ని పట్టుకున్నాను. దాని వెంట్రుకలన్నీ వెండీ, బంగారమున్నూ," అని చెప్పాడు ఇవానుష్క.

"మరైతే – ఇప్పుడా గుర్రం ఎక్కడుంది?"

"మరెన్నడూ పొలంలో పడి గోధుమ పైరు మేయనని అది ఖరారుచేసింది. అంచేత దాన్ని వదలి పెట్టేశా," అన్నాడు ఇవానుష్క.

ఇవానుష్క మాటలు వాళ్ళు నమ్మకుండా, పొట్ట చెక్కలయేటట్టు వాడి ముఖంమీదనే నవ్వేశారు. కాని ఆ రాత్రి మాత్రం పైరుమీద ఈగ వాలిన జాడైనా ఎక్కడా కనబడలేదు...

ఇది జరిగిన కొద్ది రోజులకే, జార్ చక్రవర్తి తన దూతలను దేశమంతటా పంపి, అన్ని వూళ్లలోనూ, అన్ని గ్రామాల్లోనూ చాటింపు వేయించాడు:





‘‘సామంతుల్లారా! కులీన ప్రభువుల్లారా! వర్తకుల్లారా! సామాన్యపు రైతుల్లారా! అందరూ రాజప్రాసాదం ఎదుట చేరాల్సిందండోయ్! జార్ చక్రవర్తి కుమార్తె అందాల బరిణె ఎలేన, ఎత్తుగా వున్న కోట బురుజు కిటికీలో కూచుంటుందండోయ్! ఎవడైతే తన సొంత గుర్రంమీద చెంగున ఎగిరి కిటికీ అందుకుని జార్ చక్రవర్తి కుమార్తె వేలిని వున్న వజ్రపుటుంగరాన్ని తీసుకోగల్గుతాడో, వాడిని రాజకుమార్తె వివాహం చేసుకుంటుందండోయ్!’’



అందరూ రావాల్సిందని నిర్ణయమైన రోజున, అందరితోపాటూ అన్నగార్లు కూడా జార్ చక్రవర్తి రాజ ప్రాసాదానికి బయల్దేరారు – స్వయంగా పోటీ పందెంలో పాల్గొనడానికి కాదు సుమండీ, పోటీ పందెంలో పాల్గొనేవారిని చూడ్డానికని మాత్రమే! వెర్రివెంగళాయ ఇవానుష్క అన్నగార్లను బతిమాలుకున్నాడు:

"అన్నయ్యలూ! ఒక గుర్రాన్ని నాకు కూడా ఇవ్వండి, నేనూ మీతో వచ్చి, ఆ అందాల బరిణె ఎలే చూస్తా!"

"వెర్రివెంగళాయా! ఎక్కడికొస్తావురా, నువ్వు? బాగు బాగు, ఎవరైనా చూసి నవ్విపోగలరు! పొయ్యి తీనె మీదకి పోయి అగ్గి బుగ్గి అయిపోయేదాకా తొంగో!" అనేశారు అన్నగార్లు.

అలా అనేసి వాళ్ల వెళ్లిపోయారు. వాళ్ల వెళ్లిపోయాక, వదినెగార్లతో ఇవానుష్క ఇలా అన్నాడు:

"నారబుట్ట ఇల్లా ఇవ్వండి. అడవికెళ్లి పుట్టకొక్కులు ఏరుకొస్తా."

నారబుట్ట పట్టుకుని, పుట్టకొక్కులు ఏరుకొచ్చేందుకు అన్నట్టుగా బయల్దేరాడు ఇవానుష్క.

ఇవానుష్క వెల్లడ్డి పొలంలోకి వెళ్లి, అక్కడనుంచి బారు మైదానంమీదకి వెళ్లి, నారబుట్టని ఒక పొదలో గిరవాటేసి, చెవులు గింగిరాలెత్తేటట్టు గట్టిగా ఈల కొట్టి, దిక్కులు పిక్కటిల్లేటట్టు కేకేశాడు:

"మాయ గుర్రమా – మేటి గుర్రమా! జ్ఞానివైన తేజి గుర్రమా! గడ్డిమీద రాలే ఆకులాగ, నా ఎదుట వచ్చి నిలబడు!"

గుర్రం పరుగెత్తి వచ్చింది, భూమి గజగజ వణకింది. దాని ముక్కుచెరమల్లోనుంచి పొగ ఎగజిమ్ముతూంది, చెవుల్లోనుంచి మంటలు మండుకొస్తున్నాయి. నేలకి అంటుకుపోయినట్టు గుర్రం ఇవానుష్క ఎదుట నిలబడి:

"ఏమిటి నీ ఆజ్ఞ?" అని అడిగింది.



"ఫలానా, ఫలానా," అని అసలు వృత్తాంతం చెప్పాడు ఇవానుష్క.

"సరే. నువ్వు నా కుడి చెవిలో దూరి, ఎడమ చెవిలోంచి బయటికిరా!" అంది గుర్రం.

ఇవానుష్క గుర్రం కుడి చెవిలో దూరి, ఎడమ చెవిలోంచి బయటికి వచ్చేసరికల్లా – టింగురంగామంటూ పూలరంగడులా మారి పోయాడు!





మాయ గుర్రంమీద స్వారిచేస్తూ ఇవానుష్క ఎకాయెకీని పట్నానికి ఝామని దూసుకుపోయాడు.

దారిలో అన్నగార్లను దాటిపోయాడు ఇవానుష్క – గుర్రం దౌడుకి రోడ్డు ధూళి మేఘంలా లేచి, ధూళి రేణువులు వాన చినుకుల్లా పడ్డాయి నేలమీద.



ఇవానుష్క మాయ గుర్రాన్ని – మేటి గుర్రాన్ని బూటుకాళ్ల ముళ్లతో డొక్కల్లో గట్టిగా పొడిచాడు... మాయ గుర్రం గుర్రుమని బుసకొట్టింది, ఖైంయ్‌మని శకిలించింది, చెంగుమని నిలువునా ఎగిరింది – కాని సరిగ్గా మూడు జానల్లో తప్పిపోయింది జార్ చక్రవర్తి కుమార్తె కూచున్న కిటికీని అందుకుందుకు.

ఈ సాహసాన్ని చూసి జనం ఆశ్చర్యంతో తబ్బిబ్బయిపోయారు. ఇవానుష్క మాయ గుర్రాన్ని వెనక్కి మళ్లించి, అక్కడనుంచి చల్లగా జారుకున్నాడు.

“ఎవరీ మనిషి? ఎవరీ మనిషి?” అని అందరూ ఒక్కపెట్టున కేకపెట్టారు.

ఇవానుష్క అసలక్కడ వుంటే కద! జనం ఇటు చూశారు, అటు చూశారు — ఎక్కడికెళ్ళాడో, ఎటు మాయమయాడో ఎవరికేనా కనబడితే కద!

ఇవానుష్క పట్నంనుండి వచ్చేసి, వెల్లడి పొలంలోకి వెళ్లి, గుర్రం ఎడమ చెవిలో దూరి, కుడి చెవిలో నుండి బయటికొచ్చే సరికి — మళ్ళీ ఎప్పట్లాగానే వెర్రివెంగళాయ ఇవానుష్క అయిపోయాడు. మాయ గుర్రం — మేటి గుర్రాన్ని వదలిపెట్టేసి, ఒక్కడే ఇంటికి వెళ్లిపోయాడు. ఇల్లు చేరుకుని పొయ్యి తీనె ఎక్కి, అన్నగార్లకోసం ఎదురుచూస్తూ పొయ్యి తీనెమీద కూచున్నాడు.

అన్నగార్లు ఇంటికి తిరిగివచ్చి, పట్నంలో చూసినదంతా భార్యలతో చెప్పారు: “ఏమర్రోయ్! జార్ చక్రవర్తి దగ్గరకు ఎటువంటి వూలరంగడు వచ్చాడనుకున్నారు! అటువంటి వాడిని ఇంతవరకూ మా జీవితంలో మేం చూడలేదు. ఒక్క మూడు జానల్లో మాత్రమే తప్పిపోయాడు జార్ చక్రవర్తి కూతురును అందుకుందుకు!”

ఇవానుష్క పొయ్యి తీనె మీద కూచునే ఇదంతా విని, తనలో తాను నవ్వుకుంటూ:

“అన్నయ్యలూ! నేను మీకక్కడ అవుపడ్డానా?” అని అడిగాడు.

“నువ్వేమిటి, అక్కడ మాకు అవుపడడమేమిటి? ఏడిసినట్టే వుంది! పొయ్యి తీనె మీదకి ఎక్కిపోయి, ఈగల్ని పట్టుకుంటూ కూచోడమే నీ పని!...” అనేశారు.

అన్నగార్లు మరుచటినాడు మళ్ళీ పట్నం వెళ్ళారు; వాళ్ళా వెళ్లిపోగానే ఇవానుష్క నారబుట్ట పట్టుకుని పుట్టకొక్కుల కోసమని అడవికి బయల్దేరాడు.

వెల్లడి పొలంలోకి వెళ్లి, అక్కడనుంచి బారు మైదానంమీదకెళ్లి, నారబుట్ట గిరవాటేసి, చెవులు గింగిరాలెత్తేటట్టు గట్టిగా ఈల కొట్టి, దిక్కులు పిక్కటిల్లేటట్టు కేకవేశాడు:

“మాయ గుర్రమా — మేటి గుర్రమా! జ్ఞానివైన తేజి గుర్రమా! గడ్డిమీద రాలిన ఆకులాగ, నా ఎదుట వచ్చి నిలబడు!”

గుర్రం పరుగెత్తి వచ్చింది, భూమి గజగజ వణకింది, దాని ముక్కుచెరమల్లోనుంచి పొగ ఎగజిమ్ముతూంది, చెవుల్లోనుంచి మంటలు మండుకొస్తున్నాయి. నేలను అంటుకుపోయినట్టు, గుర్రం ఇవానుష్క ఎదుట నిలబడింది.

ఇవానుష్క గుర్రం కుడి చెవిలో దూరి, ఎడమ చెవిలోంచి బయటకు వచ్చాడు. బయటకి వచ్చేసరికల్లా — టింగురంగామంటూ వూలరంగళ్లలో వూలరంగడులా మారిపోయున్నాడు. ఇవానుష్క గుర్రాన్ని స్వారిచేస్తూ ఏకాయెకీని రాజప్రాసాదానికి ఝామని దూసుకుపోయాడు.



ఇక చూడండి! పట్నంలో క్రితం రోజుకంటె మరీ అధికంగా పోగయారు జనం. జార్ చక్రవర్తి కుమార్తెను చూసి అందరూ ఆశ్చర్య పరవశులైపోయారు, ఆమె అందాన్ని వేనోళ్ల శ్లాఘించారు, కాని సాహసించి ఉంగరం తీసుకుందుకు ఒక్కడికైనా దమ్ములు లేకపోయాయి — తలకాయ ముక్కచెక్క లవుతుందని అందరికీ హడలెత్తింది.



ఇవానుష్కా తన గుర్రాన్ని బూటుకాళ్ల ముళ్లతో డొక్కల్లో పొడిచాడు... మాయ గుర్రం — మేటి గుర్రం గుర్రుమని బుసకొట్టింది, ఖైంయ్‌మని శకిలించింది, చెంగుమని నిలువునా ఎగిరింది – కాని సరిగ్గా రెండు జానల్లో తప్పిపోయింది జార్ చక్రవర్తి కుమార్తె కూచునున్న కిటికీని అందుకుందుకు.

ఇవానుష్క మాయ గుర్రాన్ని వెనక్కి మళ్లించి, అక్కడనుంచి చల్లగా జారుకున్నాడు. జనం ఇటు చూశారు, అటు చూశారు — ఎక్కడికెళ్ళాడో, ఎటు మాయమయాడో ఎవరికేనా కనబడితే కద!

ఇవానుష్క అప్పటికప్పుడే వెల్లడి పొలం చేరుకున్నాడు. మాయ గుర్రాన్ని వదలిపెట్టేసి, అడవిలోనుంచి విషపు పుట్టకొక్కులు ఏరుకొచ్చి, అవి పట్టుకుని ఇంటికి వెళ్లిపోయాడు. వాటిని చూసి, వదినెగార్లకి ఇవానుష్కమీద వాళ్ల మండుకొచ్చి:

‘‘ఇలాంటివి మోసుకొచ్చావా? ఏడ్సినట్టే వుంది, నువ్వూ నీ పుట్టకొక్కులూనూ, వెర్రివెంగళాయా! వీటిని నువ్వే తింటేసరి,’’ అని కసరుకున్నారు.

ఇవానుష్క తనలో తాను నవ్వుకుని, పొయ్యి తీనె ఎక్కి, దానిమీద కూచున్నాడు.

ఇంతట్లో అన్నగార్లు ఇల్లు చేరుకుని, పట్నంలో విశేషాలు చెప్పారు:

‘‘ఏమర్రోయ్! నిన్న వచ్చిన పూలరంగడే మళ్ళీ ఈవేళ కూడా వచ్చాడు! రెండు జానల్లో మాత్రమే తప్పిపోయాడు జార్ చక్రవర్తి కూతురు కూచునున్న కిటికీని అందుకుందుకు!’’

ఇవానుష్క అన్నగార్లను ప్రశ్నించాడు:

‘‘అన్నయ్యలూ! నేను మీకక్కడ అవుపడ్డానా?’’

‘‘కూచో నువ్వక్కడ, నోరుమూసుకుని, వెర్రివెంగళాయా!...’’ అని అన్నగార్లు వాడిని కసిరేశారు.

మూడో రోజున మళ్ళీ జరిగింది జార్ చక్రవర్తి నియమించిన పోటీ పందెం. పోటీ పందెం చూసేందుకని అన్నగార్లు ప్రయాణసిద్ధమయారు. ఇవానుష్క అన్నగార్లని బతిమాలుకున్నాడు:

‘‘అన్నయ్యలూ! నాకు కూడా ఒక గుర్రాన్ని ఇవ్వరూ? నేను కూడా మీతో వస్తానూ!’’

‘‘ఫో! వెర్రివెంగళాయా, పోయి ఇంట్లో కూచో నువ్వు! అక్కర్లేని పనులు నీకెందుకు? ఫో!’’ అని కసిరేసి వెళ్లిపోయారు.

ఇవానుష్క వెల్లడి పొలంలోకి వెళ్లి, అక్కడనుంచి బారు మైదానం మీదకెళ్లి చెవులు గింగిరాలెత్తేటట్టు గట్టిగా ఈల కొట్టి, దిక్కులు పిక్కటిల్లేటట్టు కేకేశాడు:

‘‘మాయ గుర్రమా – మేటి గుర్రమా! జ్ఞానివైన తేజి గుర్రమా! గడ్డిమీద రాలే ఆకులాగ, నా ఎదుట వచ్చి నిలబడు!’’





గుర్రం పరుగెత్తి వచ్చింది, భూమి గజగజ వణకింది, దాని ముక్కుచెరమల్లోనుంచి పొగ ఎగజిమ్ముతూంది, చెవుల్లోనుంచి మంటలు మండుకొస్తున్నాయి. నేలను అంటుకుపోయినట్టు, గుర్రం ఇవానుష్క ఎదుట నిలబడింది.

ఇవానుష్క గుర్రం కుడి చెవిలో దూరి, ఎడమ చెవిలోనుంచి బయటికి వచ్చాడు — బయటికి వచ్చేసరికల్లా టింగురంగామంటూ పూలరంగళ్లలో పూలరంగడులా మారిపోయున్నాడు. గుర్రంమీద స్వారిచేస్తూ జార్ చక్రవర్తిగారి రాజప్రాసాదం ఎదుట ప్రత్యక్షమయాడు.

కోటబురుజు అందుకుందుకు ఇవానుష్క గుర్రంమీద ఒక్క పరుగున వచ్చాడు, తన బూటుకాళ్ల ముళ్లతో గుర్రాన్ని డొక్కల్లో పొడిచాడు... మాయ గుర్రం — మేటి గుర్రం వెనుకటికంటె మరింత భీకరంగా గుర్రుమని బుసకొట్టింది, నేలను డెక్కతో గట్టిగా కొట్టింది, చెంగున నిలువునా ఎగిరింది — ఎగిరి కిటికీని అందుకుంది!

ఇవానుష్క జార్ చక్రవర్తి కుమార్తె ఎర్రని పెదవులను ముద్దుపెట్టుకున్నాడు, ఆమె వేలిని తళుక్కులు మెరుస్తూన్న వజ్రపుటుంగరాన్ని చప్పున తీసుకున్నాడు, గుర్రాన్ని వెనక్కి మళ్లించి, తటాలున అక్కడనుంచి దౌడు తీశాడు.

అది చూసి జనం పెద్ద గొణగొణధ్వని చేసుకుంటూ: "పట్టుకోండి అతడిని! ఆపండి అతడిని!" అంటూ బొబ్బరించారు. కాని వారికెవ్వరికీ కనబడకుండా — తానొక్కడే మట్టుకు వాళ్ళని చూస్తూ — ఇవానుష్క అక్కడనుంచి మాయమైపోయాడు!

మాయ గుర్రాన్ని వదలిపెట్టేసి, ఒక గుడ్డ పేలికను చేతికి చుట్టుకుని, ఇవానుష్క ఇంటికి వెళ్లిపోయాడు.

"చేతికి ఏమైంది?" అని అడిగారు వదినెగార్లు.

"ఏమీ లేదూ, పుట్టకొక్కుల కోసం వెతుకుతూంటే చేతికి రెమ్మలు గుచ్చుకున్నాయి..." అనేశాడు ఇవానుష్క.

అలా అనేసి, పొయ్యి తినె మీదకెక్కిపోయి పడుకున్నాడు.





అన్నగార్లు పట్నంనుంచి తిరిగివచ్చి, భార్యలతో పట్నంలో విశేషాలు చెప్పారు:

''ఏమ్రోయ్! ఆ పూలరంగడు ఈవేళ చెంగున ఎగిరి, జార్ చక్రవర్తి కూతురు వేలిని వున్న వుంగరాన్ని తీసుకుని, ఆమెని పెదవులమీద ముద్దుపెట్టుకున్నాడ్రా!''

ఇవానుష్క లేచి, పొగగొట్టాన్ని చేరబడి, ఏమీ ఎరగనట్టు:

''అన్నయ్యలూ! నేను మీకక్కడ అవుపడ్డానా?'' అని అడిగాడు.

''పిచ్చిమాటలు పేలక, నోరు మూసుక్కూచో అక్కడ!'' అని కసిరేశారు అన్నగార్లు.

జార్ చక్రవర్తి కుమార్తె వేలినుంచి తాను అందుకున్న వజ్రపుటుంగరాన్ని ఒకమాటు చూసుకుందామనిపించింది ఇవానుష్కకి.

తన చేతికి చుట్టుకున్న గుడ్డ పేలికను ఇవానుష్క విప్పకునేసరికల్లా — ఆ గుడిసె అంతా ఒక్క పాళంగా జిగ్గుమని మెరిసింది!

''వెర్రివెంగళాయా! నిప్పుతో నీకు చెలగాటమ్రటా? పారేయ్ అదక్కడ, వీడెప్పుడో ఒకనాడు కొంప తగలెట్టక మానడు. వీణ్ణి కొంపలోంచి ఇక తగిలెయ్యాలి!'' అని అన్నగార్లు గొడవచేశారు.

ఇవానుష్క నోరు మెదపలేదు, మారు మాటాడలేదు — వుంగరాన్ని మాత్రం వేలికి పెట్టేసుకుని, చేతిని మళ్ళీ గుడ్డ పేలికతో కట్టుకట్టేసుకున్నాడు.



ఇది జరిగిన మూడో రోజున జార్ చక్రవర్తి మళ్ళీ చాటింపు వేయించాడు: తన సామ్రాజ్యంలో వున్న యావన్మంది ప్రజలూ రాజప్రాసాదంలో తాను చేస్తూన్న విందుకు హాజరుకావాల్సిందనీ, ఒక్కడైనా సరే ఇంట్లో వుండిపోకూడదనీ, విందుకు హాజరుకాకుండా వుండిపోయినవాడికి శిరచ్ఛేదం అయిపోతుందనీ!

ఇక మరి చేసేదేమీ లేక, అన్నగార్లు వెర్రివెంగళాయ ఇవానుష్కని తమతో కూడా విందుకు తీసుకుపోయారు.

విందుకొచ్చిన వారందరూ టేబిలుగుడ్డలు పరచి వున్న ఓక్ బల్లల చుట్టూ కూచుని, మద్యం సేవించారు, పిండివంటలు ఆరగించారు, బాతాఖానీలు సాగించారు.

ఇవానుష్క మాత్రం పొయ్యి తీనె వెనుక, ఒక మూల కూచున్నాడు.

అందాల బరిణె ఎలేన వచ్చి, అతిథులందరికీ ద్రాక్షసారాయమూ, మధుమద్యమూ అందిచ్చింది; వారెవరి వేలికైనా తన ముద్దుటుంగరం వుందేమో, ఆ వుంగరం వున్నవాడిని పెళ్లిచేసుకుందామని జాగ్రత్తగా చూసింది.

ఎవ్వరి వేలినీ కనబడలేదు ఆ వుంగరం.

అందరి దగ్గరకూ వెళ్లి చూసిన తరువాత, జార్ చక్రవర్తి కుమార్తె చిట్టచివరకు ఇవానుష్క దగ్గరకు వచ్చింది. పొయ్యి వెనుక కూచునున్నాడు ఇవానుష్క – కట్టుగుడ్డలన్నీ మాసిపోయున్నాయి, చేతికి గుడ్డపేలికతో కట్టు వుంది.

అన్నగార్లు చూసి, వాళ్లలో వాళ్లు అనుకున్నారు: "చూడండి! మా ఇవానుష్కకి జార్ చక్రవర్తి కూతురే స్వయంగా మద్యం అందిస్తూంది — ఏమి చోద్యం!"

జార్ చక్రవర్తి కుమార్తె ఒక గ్లాసులో మద్యం పోసి, ఇవానుష్కకి అందిచ్చి:

"ఏం అబ్బాయీ! చేతికి కట్టు కట్టుకున్నావేమి?" అని అడిగింది.

"పుట్టకొక్కులు ఏరడానికని అడవికెళ్ళా, చేతికి రెమ్మలు గుచ్చుకున్నాయి."

"అలాగా! ఏదీ కట్టు విప్పి చూపించూ, చూదాం!"

గుడ్డ పేలికతో కట్టుకున్న కట్టును ఇవానుష్క విప్పేసరికి, ఆ అబ్బాయి వేలిని వుంది — జార్ చక్రవర్తి కుమార్తె ముద్దుటుంగరం. వుంగరం ధగధగ మెరిసిపోతూంది, వెయ్యి తళ్కులు విరజిమ్ముతూంది!

జార్ చక్రవర్తి కుమార్తె ఆనందంతో ఉప్పొంగిపోయి, ఇవానుష్క చేతిలో చేయివేసి, తండ్రి దగ్గరకు తీసుకెళ్లి:

"నాన్నా! ఇదిగో నా ప్రాణనాథుడు!" అని చూపించింది.

ఇవానుష్కను అభ్యంజన స్నానం చేయించి, కొత్త బట్టలు కట్టించేసరికి — టింగురంగామని వూలరంగళ్లలో వూలరంగడులా తయారయాడు — వెనుకటి వెర్రివెంగళాయ ఇవానుష్క అని ఎవ్వరూ పోల్చుకోలేకపోయారు.

ఇక మరి అక్కడ ఏ ఆలస్యమూ, ఏ చర్చ లేకుండానే — అమితోల్లాసంతో సాగుతూన్న ఆ విందులోనే వివాహ మహోత్సవం కూడా వైభవోపేతంగా జరిగింది!

విందులో నేనూ పాల్గొంటి,
మధు మద్యములూ తాగితి,
అంతా గడ్డముపైనే పోసుకొంటి,
కొంతైనా పోలేదు నోట్లోకి!





